


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 111 మంగళవారం 22 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

## 28కి గాను నడుస్తున్నవి 4

- రాష్ట్రంలో మూతపడుతున్న జూట్ పరిశ్రమలు
- అవి కూడా ఉత్తరాంధ్రలోనే..
- వీధినపడిన వేలాది కుటుంబాలు
- నిర్వహణభారంతో చేతులెత్తేసిన యాజమాన్యాలు
- ప్రేక్షక పాత్రలో ప్రభుత్వాలు

ఏపీలో జూట్ పరిశ్రమలు మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్థిల్లేవి. కానీ రానురాను తిరోగమనంలో పడ్డాయి. వరుసగా మూతపడుతూ వస్తున్నాయి. ఉత్తరాంధ్రలో ఒకటి రెండు పరిశ్రమలు మాత్రమే నడుస్తున్నాయి. అవి కూడా అతి కష్టమ్మీద నడుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వాల ప్రోత్సాహం కరువవ్వడం, ముడిసరుకులు దొరకకపోవడం, ఆపై పరిశ్రమల నిర్వహణ భారం కావడంతో యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. అటు గోగు పంటసాగు కూడా పడిపోయింది. దీంతో గోగును దిగుమతి చేసుకొని ఉత్పత్తి అంటే ఇబ్బందికరమే. అందుకే ఒక్కో పరిశ్రమ మూతపడుతూ వస్తోంది. ఒకటి, అరా మాత్రమే ఇప్పుడు పరిశ్రమలు నిర్వహణలో ఉన్నాయి.

**వేలాది మంది ఉపాధికి దూరం..**

జూట్ పరిశ్రమ కుదేలవుతోంది. ఒక్కో పరిశ్రమ మూతపడుతూ వస్తోంది. రాష్ట్రంలో 28 పరిశ్రమలకుగాను మిగతా2లో





## పేరుకే 'కింగ్'జార్జి

- కేజీహెచ్ లో అన్నీ సమస్యలే
- ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రికి సుస్తి
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రజలకు అరకొరగా వైద్యసేవలు
- వేలాది మంది రోగులకు తప్పని ఇబ్బందులు

కింగ్ జార్జి అస్పత్రి..ముద్దుగా ఉత్తరాంధ్ర ప్రజలు పెద్దాస్పత్రిగా పిలుచుకుంటారు. ఒక్క ఉత్తరాంధ్ర మాత్రమే కాదు. పక్కనే ఉన్న ఒడిశా, చత్తీస్ గడ్ ల నుంచి సైతం రోగులు తరలివస్తుంటారు. నిత్యం వేలాది మంది రోగులతో కిటకిటలాడుతూ కనిపిస్తూ ఉంటుంది కేజీహెచ్. కానీ పెరుగుతున్న రోగులకు తగ్గట్టు మాత్రం వసతులు సమకూరడం లేదు. వైద్యసేవలు మెరుగుపడం లేదు. దీంతో రోగులకు ఎదురవుతున్నఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వందేళ్ల చరిత్ర ఈ ఆస్పత్రి సొంతం.రోజుకు సగటున 3,500 నుంచి నాలుగు వేల మధ్య ఓపీ ఉంటుంది. ఇన్‌పేషెంట్లు మరో రెండు వేల మంది ఉంటారు. అయితే రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు లేరు. ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులను ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా ప్రయోజనం లేకుండా పోతోందని అధికారులు చెబుతున్నారు. గత వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా ఉండేది. కూటమి వచ్చిన తరువాత గాడిన పెట్టే మిగతా2లో



2

### వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు..

- పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు
- జగన్ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో అవినీతి జరిగిందని తీవ్ర ఆరోపణలు
- పార్టీలో సీనియారిటీకి గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేసిన వరుపుల

## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి మిగతా2లో

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం

### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్



- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ

స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరో పణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకా రులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అ న్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవం లా భావించే టీచర్లపై దాడి మిగతా2లో



2

### డీఎస్సీ చేపట్టడం ఓర్వలేకే టీచర్లపై దాడులు

-వైసీపీపై మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి ఫైర్ -విజయవాడలో శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు వర్సెస్ వైసీపీ శ్రేణులు -దాడి ఘటనను తీవ్రంగా పరిగణించామన్న మంత్రి గొట్టిపాటి -దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక -డీఎస్సీని ఓర్వలేకే వైసీపీ దాడులని నేతల విమర్శ

# 28కి గాను నడుస్తున్నవి 4

**వేలాది మంది ఉపాధికి దూరం..**

జూట్ పరిశ్రమ కుదేలవుతోంది. ఒక్కో పరిశ్రమ మూతపడుతూ వస్తోంది. రాష్ట్రంలో 28 పరిశ్రమలకుగాను ఇప్పటికే 24 మూతపడ్డాయి నాలుగు మాత్రమే నడుస్తున్నాయి. ఈ పరిశ్రమలు సైతం ఉత్తరాంధ్రలోనే నడుస్తుండడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా జూట్ మిల్లుల్లో 50 వేల మంది ఉపాధి పొందేవారు. క్రమేపీ పరిశ్రమలు మూతపడడంతో వేల మంది రోడ్డున పడ్డారు. ఉన్న పరిశ్రమలు అతికష్టమ్మీద నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే పరిశ్రమల మూతకు ప్రధాన కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ముడిసరుకుల ధరలు భారీగా పెరడటం, జనుము పంట తగ్గడం, ప్లాస్టిక్ వినియోగం పెరగడం, జూట్ ఉత్పత్తులకు డిమాండ్ లేకపోవడం తదితర కారణాలతో ఈ పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్ రాయితీలు, రుణాల రూపంలో ప్రోత్సాహకాలు లేకపోవడం కూడా ఒక కారణం.

**గణనీయంగా తగ్గిన సాగు..**

గోగు పంటలు లేక పరిశ్రమల యజమాన్యాలు నానా అవస్థలు పడుతున్నాయి. పశ్చిమబంగ, రాజస్థాన్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి గోగు నార తీసుకువచ్చి పరిశ్రమలు నడిపించాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో మన రాష్ట్రంలోని రైతులే పూర్తిస్థాయిలో గోగు ఉత్పత్తి చేసేవారు. అప్పట్లో రైతులకు గిట్టుబాటు ఉండేది. తర్వాత రోజుల్లో గోగు పండించాలంటే రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విత్తనాల సేకరణ నుంచి గోగు ఊరపెట్టడం, నారతీయటం వంటి పనులు చేపట్టడం రైతులకు కష్టమే అయినా వాటిని అధిగమించి పండించేవారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు ముందుకు రావడంలేదు. ఈ ఏడాది గోగునారకు మంచి ధర పలికినా రైతులు పూర్తిస్థాయిలో పంట వేయలేదు. క్వింటాల్ రూ.12వేలు వరకు పలికింది.

**జాడలేని జూట్ కార్పొరేషన్**

గోగు పంటను కొనుగోలు చేయడానికి జూట్ కార్పొరేషన్ వారు ముందుకు వచ్చేవారు. అయితే జూట్ కార్పొరేషన్ ఇప్పుడు మూలకు చేరింది. అప్పట్లో నియమించిన సిబ్బంది పదవీ విరమణ చేశాక కొత్త వారిని నియమించలేదు. గతంలో జూట్ కార్పొరేషన్ అధికారులు వ్యవసాయశాఖ అధికారుల సహకారంతో గోగు పంటపై రైతులకు అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నిస్తే జూట్ కార్పొరేషన్ అధికారుల జాడే కనిపించలేదని అంటున్నారు.

# పేరుకే 'కింగ్'జార్జి

దీంతో రోగులకు ఎదురవుతున్నఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వందేళ్ల చరిత్ర ఈ ఆస్పత్రి సొంతం. రోజుకు సగటున 3,500 నుంచి నాలుగు వేల మధ్య ఓపీ ఉంటుంది. ఇన్‌పేషెంట్లు మరో రెండు వేల మంది ఉంటారు. అయితే రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు లేరు. ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులను ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నా ప్రయోజనం లేకుండా పోతోందని అధికారులు చెబుతున్నారు. గత వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా ఉండేది. కూటమి వచ్చిన తరువాత గాడిన పెట్టే ప్రయత్నం చేస్తోంది.

**రెట్టింపు సిబ్బంది నియమిస్తేనే..**

అత్యవసర, అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని కేజీహెచ్ కు రిఫర్ చేస్తుంటారు. కేజీహెచ్‌లో సుమారు 40 విభాగాలతో సేవలు అందిస్తున్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల/కేజీహెచ్‌కు స్పెషాలిటీ విభాగాల్లో 67 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 57 మంది ఉన్నారు. పది ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో రెండేసి, ఆప్తమాలజీ, జనరల్ సర్జరీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ, యూరాలజీ, సర్జికల్ అంకాలజీ విభాగాల్లో ఒక్కొక్క ప్రొఫెసర్ పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయి. అలాగే, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 60 మంజూరు కాగా, మూడు ఖాళీలు ఉన్నాయి. ఆప్తమాలజీ, జనరల్ సర్జరీలో ఈ ఖాళీ ఉన్నాయి. 181 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 165 మంది ఉన్నారు. మరో 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డెర్మటాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాల్లో నాలుగేసి, పీడియాట్రిక్ సర్జరీలో రెండు, ఈఎన్‌టీ, కార్డియాలజీ, పీడియాట్రిక్స్, న్యూరో సర్జరీ, యూరాలజీ, మెడికల్ అంకాలజీ విభాగాల్లో ఒక్కొక్క అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. అలాగే, నాన్ క్లినికల్ విభాగానికి సంబంధించి 16 ప్రొఫెసర్ పోస్టులు మంజూరుకాగా, మూడు ఖాళీ ఉన్నాయి. బయోకెమిస్ట్రీ, పెథాలజీ, ఫోరెన్సిక్ డిపార్టుమెంట్‌లో ఒక్కొక్క పోస్టు చొప్పున ఖాళీ ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 22 మంజూరు కాగా, మూడు ఖాళీ ఉన్నాయి. ఫోరెన్సిక్ మెడిసిన్‌లో రెండు, బయో కెమిస్ట్రీలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయి. అలాగే, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 74 మంజూరుకాగా, ఆరు ఖాళీలు ఉన్నాయి. అనాటమీలో మూడు, బయో కెమిస్ట్రీలో రెండు, మైక్రోబయాలజీలో ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య భారీగా పెరిగింది. ఇంకా రోజుకు సుమారు 200 వరకు మేజర్, మైనర్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయడంతోపాటు అదనపు పోస్టులను మంజూరుచేయాల్సి ఉంది. మరో 150 పోస్టులను మంజూరుచేస్తే, రోగులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా రోగుల తాకిడి పెరుగుతున్నందున కొన్ని విభాగాల్లో అదనపు యూనిట్లు ఏర్పాటుచేయాలన్న డిమాండ్ ఉంది. దానిపై కూడా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

**ఆక్సిజన్ ప్లాంట్లపై నిర్లక్ష్యం..**

కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో ఆక్సిజన్ పెద్దఎత్తున అవసరం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటుచేశాయి. ఈ క్రమంలోనే కేజీహెచ్‌లో ఆరు ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. ఇందుకోసం సుమారు రూ.5 కోట్ల వరకు ఖర్చు చేశారు. వీటి ద్వారా వందల సంఖ్యలో పడకలకు ఆక్సిజన్‌ను సరఫరా చేసేందుకు అవకాశం ఉంది. కరోనా తగ్గుముఖం పట్టినప్పటికీ తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులకు ఆక్సిజన్ నిత్యం అవసరమవుతుంది. ముఖ్యంగా ఐసీయూ, ఎన్ఐసీయూతోపాటు ఇతర అత్యవసర విభాగాల్లోని రోగులకు ఆక్సిజన్ అందించాల్సి ఉంటుంది. ఇందుకు ఆస్పత్రిలోని ఆరు ఆక్సిజన్ ప్లాంట్లు ఉపయోగపడతాయి. కాకపోతే విద్యుత్ వినియోగం కాస్త ఎక్కువ అవుతుంది. ఈ కారణాన్ని చూపించి అధికారులు ఆక్సిజన్ ప్లాంట్లను నిర్లక్ష్యం చేసినట్టు చెబుతున్నారు.

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగాను కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

# ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు..

కాకినాడ జిల్లాలో అధికార వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జనసేన పార్టీలో చేరారు. సోమవారం సాయంత్రం పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పవన్ వారికి సూచించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ పాలనలో ఇళ్ల స్థలాల పేరుతో భారీగా కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏమాత్రం పనికిరాని భూములను అధిక ధరలకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు కేటాయించారని, ఆ స్థలాలు ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయని విమర్శించారు. పార్టీలో తనలాంటి సీనియర్లకు సరైన గౌరవం దక్కలేదని, గతంలో తన వయసును ఉద్దేశించి కూడా జగన్ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా పవన్ కళ్యాణ్ నాయకత్వం నచ్చి ఎలాంటి పదవులు, హామీలు ఆశించకుండా జనసేనలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. వరుపుల సుబ్బారావుతో పాటు పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల నుంచి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జనసేనలో చేరారు. వీరిలో పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సామర్లకోట మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంగిరెడ్డి అరుణ, పలువురు మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## డీఎస్సీ చేపట్టడం ఓర్వలేకే టీచర్లపై దాడులు..



విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడిన ఘటనను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే గురువులపై రౌడీ మూకలతో దాడులు చేయించడం అత్యంత దారుణమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. అధికారం ఉన్నా లేకపోయినా వైసీపీ దాడుల సంస్కృతిని వీడటం లేదని విమర్శించారు. ఎన్నో సవాళ్లను అధిగమించి కూటమి ప్రభుత్వం డీఎస్సీ ఉద్యోగాల భర్తీ చేపడుతుంటే, దానిని ఓర్వలేకనే వైసీపీ ఇలా దాడులకు దిగుతోందని ఆరోపించారు. ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ చర్యను ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. గతంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన జగన్‌కు ఇప్పుడు వారిపై దాడులు చేయిస్తున్నారని గొట్టిపాటి ధ్వజమెత్తారు. ఇదే ఘటనపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా స్పందించారు. ప్రకాశం, గుంటూరు, విజయవాడకు చెందిన రౌడీషీటర్లను సమీకరించి, స్వయంగా జగనే ఈ దాడి చేయించారని సంచలన ఆరోపణలు చేశారు. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు తమకు జరుగుతున్న అన్యాయంపై న్యాయం కోరేందుకు వస్తే, వారిపై దాడి చేయడం వైసీపీ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వైసీపీ, ఇప్పుడు డీఎస్సీని అడ్డుకునేందుకు కేసులు వేసి విఫలమై, భౌతిక దాడులకు దిగుతోందని విమర్శించారు. నారా లోకేశ్‌కు వస్తున్న మంచి పేరును తట్టుకోలేకే జగన్ ఇలాంటి కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఏలూరి ఆరోపించారు. ఈ దాడిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## ఆఖరి మానవ రచయిత ఇంకా ఎంతెంత దూరం?




సాహిత్యం ఎప్పుడూ ప్రశ్నల మధ్యనే బతికింది. మనిషి ఎవరు? ప్రేమ అంటే ఏమిటి? మరణం తర్వాత మిగిలేదేమిటి? జ్ఞాపకం మనిషిలో ఉంటుందా, మనిషే జ్ఞాపకంలో ఉంటాడా? అన్నవే ఆ ప్రశ్నలు. కాలం మారినప్పుడల్లా ప్రశ్నల రూపం మారింది. ఇప్పుడు కృత్రిమ మేధ సాహిత్యం ముందు నిలబెడుతున్న ప్రశ్నలు మాత్రం మరింత అసౌకర్య మైనవి. యంత్రం సృష్టించిన సాహిత్యానికి యజమాని ఎవరు? కవి, కలం అనే పాత సమీకరణం ఇప్పుడు ప్రాంప్ట్, కవి, యంత్రం అనే కొత్త త్రికోణంగా మారిందా? సోషల్ మీడియా కవిత్వాన్ని ప్రజాస్వామ్యీకరిస్తోందా, లేక అల్గారిథమ్‌కు అనుగుణంగా కుదిస్తున్నదా? భవిష్యత్ పాఠకుడు పుస్తకాన్ని చదువుతాడా, లేక దానితో మాట్లాడతాడా? యంత్రం కూడా రాయగలిగినప్పుడు మానవ రచయిత ఎందుకు? ఇవీ ఆ కొత్త ప్రశ్నలు. ఏఐ ఏదైనా సరే అద్భుతంగానే రాసేస్తుందేమోనన్న వాదనను కొట్టిపారేయాల్సిన అవసరం లేదు. “ఏఐ ఎప్పటికీ మనిషిలా రాయలేదు” అని మనల్ని మనం ఓదార్చుకోవడం వంచనే అవుతుంది. అసలు ప్రశ్న– – మనిషి ఎందుకు రాస్తాడు? అన్నది. కొన్నిసార్లు మనిషి బతకడానికి రాస్తాడు. ప్రేమ విఫలమైన తర్వాత రాస్తాడు. జైలులో రాస్తాడు. యుద్ధం మధ్య రాస్తాడు. తనను ఎవరూ విననప్పుడు కాగితానికి చెబుతాడు. అంటే రచన ఒక ఉత్పత్తి మాత్రమే కాదు. ఒక మానవ చర్య. కొన్నిసార్లు సాక్ష్యం. కొన్నిసార్లు ప్రతిఘటన. కొన్నిసార్లు తనను తాను కాపాడుకునే ప్రయత్నం. మనిషి యంత్రం ముందు కూర్చుని, “కవిత రాయి” అంటున్నాడు. చూడటానికి సాధారణమైన ఈ వాక్యం సాహిత్య చరిత్రలో అసాధారణమైనది. ఇంతకు ముందెప్పుడూ లేనిది. ఇంతకాలం మనిషి తన కథను మరో మనిషికి చెప్పాడు. ఇప్పుడు తనకోసం కథో, కవితో, వ్యాసమో తయారు చేయమని యంత్రాన్ని అడుగుతున్నాడు. సాహిత్యం మొదట్నుంచీ మనిషిని నిర్వచించడానికి ప్రయత్నించింది. దేవుళ్లు, రాక్షసులు, దయ్యాలు, రోబోలు.. తనకు భిన్నమైన జీవులను ఊహించి వాటిలో తననే చూసుకుంది. ఇప్పుడు ఏఐ ఆ ప్రశ్నను మరింత సంక్లిష్టం చేస్తోంది. మరణించిన భర్త పాత మెయిళ్లు, స్వరం, ఫోటోల ఆధారంగా రూపొందించిన ఏఐ అవతార్‌తో ఒక మహిళ ప్రతిరోజూ మాట్లాడుతుందనుకుందాం. ఆమె ఎవరితో మాట్లాడుతోంది? భర్తతోనా? జ్ఞాపకంతోనా? డేటాతోనా? తన ఒంటరితనంతోనా? ఒక హ్యూమనాయిడ్ “నాకు బాధగా ఉంది” అంటే, అది నిజంగా బాధపడుతోందా అన్నది మాత్రమే ప్రశ్న కాదు. అది బాధపడుతోందని మనిషి నమ్మితే ఆ సంబంధం నిజమవుతుందా? అన్నదే మరింత ఆసక్తికరం. ఒకప్పుడు కవితను సంపాదకుడు ఎంపిక చేసేవాడు. తర్వాత పాఠకుడు ఎంపిక చేశాడు. ఇప్పుడు అల్గారిథమ్ ఎవరికి ఏ కవిత కనిపించాలో నిర్ణయిస్తోంది. పొడవైన ధ్యానాత్మక కవిత కంటే వెంటనే అర్థమయ్యే పంక్తి వేగంగా ప్రయాణిస్తుంది. రెండోసారి చదివినప్పుడు మాత్రమే తెరుచుకునే కవితకంటే మొదటి మూడు సెకన్లలో ఆకట్టుకునే వాక్యానికి ఎక్కువ అవకాశముంటుంది. ఇక్కడ ప్రమాదం రచన చిన్నదవడం కాదు. పాఠకుడి ఓపిక చిన్నదవడం. సోషల్ మీడియా కవిత్వానికి ఒక ప్రజాస్వామ్యాన్నిచ్చింది. ప్రచురణకర్త తలుపు మూసిన కవికి అది కిటికీని తెరిచింది. కానీ ప్రతి ప్రజాస్వామ్యం వెంట మార్కెట్ కూడా వస్తుంది. కవిత చదవటమే కాదు, ఎన్ని సెకన్లు చూసారు, ఎన్ని సార్లు షేర్ అయింది అన్నది కూడా ఆ కవిత ప్రయాణాన్ని నిర్ణయిస్తోంది. ఏఐ ఈ వేగాన్ని మరింత పెంచుతోంది. ఒకే భావానికి పదిరూపాలు క్షణాల్లో తయారవుతాయి “ఇంకా విషాదంగా”, “మరింత తాత్వికంగా”, “ఇంకా వైరల్ అయ్యేటట్టు”. ఇక్కడ కవి ఎదుర్కొనే అసలు ప్రమాదం యంత్రం తన స్థానాన్ని ఆక్రమించడం కాదు. తన స్వరాన్ని తానే గుర్తుపట్టలేని స్థితికి చేరడం. ఇక్కడే సృజన కర్తృత్వం అనే ప్రశ్న వస్తుంది. ఒక కవి ఏఐతో “భర్త చనిపోయిన తర్వాత అతని ఖాళీ కుర్చీతో మాట్లాడుతున్న వృద్ధురాలి మీద కవిత రాయి” అంటాడు. సందర్భం మనిషి ఇచ్చాడు. భావోద్వేగ ఉష్ణోగ్రతను మనిషి నిర్ణయించాడు. పదాలను యంత్రం అమర్చింది. అప్పుడు కవిత ఎవరిది? రచన అంటే వాక్యాలను సమర్థంగా అమర్చడమే అయితే యంత్రమూ రచయితే. కానీ రచన అంటే జీవనానుభవం భాషగా పరివర్తన చెందడం అయితే సమస్య అక్కడ మొదలవుతుంది. యంత్రానికి బాల్యం లేదు. తల్లి ఒడి జ్ఞాపకం లేదు.

## కొత్తపల్లి కేజీబీవీ విద్యార్థులు ఆత్మకూరు కరూర్ వైశ్యబ్యాంకు సందర్శన








ఆత్మకూరు సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

కొత్తపల్లి మండలంలోని, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థినులు వృత్తి విద్యలో భాగంగా సోమవారం ఆత్మకూరు పట్టణంలోని, కరూర్ వైశ్యబ్యాంకు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్కూలు వృత్తి, ఐటీ అధ్యాపకురాలు నాన్సీ బ్యూలా మాట్లాడుతూ 9,10,11,12వ తరగతుల విద్యార్థినులకు వివిధ నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు. బ్యాంకు మేనేజర్ వంశీ నిర్వాహకులు విద్యార్థినులతో స్వయంగా కొన్ని సర్వీసుల గురించి టెక్నాలజీ గురించి క్షుణ్ణంగా చెప్పారు. ఈ టెక్నాలజీ గురించి పిల్లలు తెలుసుకొని, నేర్చుకొని, అవగాహన పెంచుకొని వారి జీవితంలో ఒక మంచి గోల్ కు (ఉద్యోగం) రీచ్ కావాలనే ఆలోచన వారిలో కలిగించారు వారి ఐటీ టీచర్ నాన్సీ బ్యూలా ప్రిన్సిపాల్ కృష్ణా బాయి, తదితర అధ్యాపకులు రమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయం ముందు నల్లమల్ల చెంచు గిరిజనుల ధర్నా విజయవంతం

**–చెంచు గిరిజనులకు అభివృద్ధి సంక్షేమం పథకాలు అందించాలి**

**–మా సమస్యలు పరిష్కరించని అధికారులను కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి**

శ్రీశైలం సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం




చెంచు గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చెంచు ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం ఐటిడిఏ కార్యాలయం ముందు సోమవారం భారీ స్థాయిలో చెంచు గిరిజనులు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోచెంచు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వెంకటస్వామి, అంకన్న, ఐలేని కృష్ణుడు, ఈర్లయ్య, వెంకటేశం, లు, మాట్లాడుతూ శ్రీశైలం ఐటీడీఏ పీవోగా సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని, నల్ల మల్ల చెంచు గిరిజనుల సమస్యలు పరిష్కరి ంచాలని, ఫుడ్ బాస్కెట్ పంపిణీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు ఎస్ఆర్ఆర్ ఏజెన్సీ ద్వారా వివిధ ఆశ్రమ పాఠశాలల్లో చెంచు గిరిజనులకే పారిశుద్ధ్య కావార్మికులుగా నియమించాలని, తెలిపారు చెంచు గిరిజనులకు సంబంధించిన పొలాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేతకాని పిఓ,ను బదిలీ చేయాలని ప్రభుత్వ ఉన్నత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ చెంచుగూడాల కు చెందిన చెంచు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

**–430 గ్రాముల గంజాయి, 9 టాపెంటాడోల్ టాబ్లెట్లు స్వాధీనం**

చుండూరు సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం



చుండూరు మండలంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను చుండూరు పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 430 గ్రాముల గంజాయి, 9 టాపెంటాడోల్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం తెనాలి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు కేసు వివరాలను చుండూరు సీఐ ఆనంద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. చుండూరు మండలం మోదుకూరు గ్రామ శివారులోని పాడుబడిన హాస్టల్ భవనంలో కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్ఐ అనిల్ కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని గంజాయి సేవిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వారి వద్ద గంజాయి, టాపెంటాడోల్ టాబ్లెట్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని పొన్నూరు మండలం దండమూడి గ్రామానికి చెందిన కంబాల శ్రీనాథ్ రెడ్డి (22), చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన మొవ్వ వంశీ (22)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై చుండూరు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 57/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్లు 8(c) r/w 20(b)(ii)(A), 27(a), డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టంలోని సెక్షన్ 18(c) ప్రకారం కేసు నమోదు చేశారు.

**–మాదకద్రవ్యాలపై నిరంతర నిఘా**

జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు సీఐ ఆనంద్ తెలిపారు. పల్లెనిద్ర, కార్డెన్ అండ్ సెర్చ్, గ్రామ సుదర్శన వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ పర్యవేక్షణ పెంచడంతో పాటు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలకు ఎలాంటి అవకాశం లేకుండా చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చేతివృత్తులకు చేయూతనివ్వాలి

**–కుమ్మరుల సంక్షేమానికి రుణాలు, పెన్షన్లు మంజూరు చేయాలి**

బాపట్ల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

సంప్రదాయ చేతివృత్తుల పరిరక్షణతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా శాలివాహన సంఘం ప్రతినిధులు కోరారు. చేతివృత్తి దారులకు రుణ సదుపాయాలు కల్పించి, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మోతుకూరి శివ కోటేశ్వరరావు సూచించారు. బాపట్ల సూర్యలంక రహదారి పక్కన ఉన్న శ్రీకృష్ణ ఆశ్రమం వద్ద ఆదివారం జిల్లా శాలివాహన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల నియోజకవర్గ శాలివాహన సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురిటి హరికృష్ణ, చైర్మన్‌గా ఇంటూరి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పురిటి హరికృష్ణ మాట్లాడుతూ, సంప్రదాయ కుమ్మరి వృత్తిని కొనసా గిస్తున్న కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారిం చాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన కుమ్మ రులకు పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, వృత్తి నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తరతరాలుగా కొనసా గుతున్న చేతివృ త్తులకు ప్రోత్సాహం లభిస్తే వృత్తిదారుల జీవన ప్రమా ణాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు. చేతివృత్తి దారుల సమస్యలను సంఘటితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకె ళ్లడం, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం,



వృత్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శాలివాహన సంఘం ప్రతినిధులు పుసులూరి శ్రీనివాసరావు, చేజర్ల కోటేశ్వరరావు, రాయపూడి వెంకటేశ్వర్లు, ఇనకొల్లు పోలీసు రావు, చందోలు లక్ష్మీనారాయణ, వేజెండ్ల భాస్కరరావు, నిజాంపట్నం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 22 సెప్టెంబర్ 2026

# చిన్నారుట్ల చెంచుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తా

-చిన్నారుట్ల చెంచు గిరిజన గుడానికి కరెంటు అనుమతులు వచ్చేలా కృషి చేస్తాను.

మార్కాపురం సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

చిన్నారుట్ల చెంచుల సమస్యలను పరిష్కరించే రీతిగా చూస్తానని మార్కాపురం "డీఎఫ్ ఓ" చెంచు గిరిజనులకు హామీలి ఇచ్చారు.... మార్కాపురం జిల్లా. లో ఫారెస్ట్ ఆఫీస్ నందు డిఎఫ్ ఓ ను, కొమరం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై, ఆశీర్వాదం వీటీడీఏ ప్రెసిడెంట్ చెవుల గురవయ్య, వారు ఇరువురు కలిసి వినతిపత్రం ఇచ్చి వారు డిఎఫ్ తో మాట్లాడుతూ, దోర్నాల మండలం పరిధిలో ఉన్న చిన్నారుట్ల చెంచు గిరిజన గూడెంలో 120 కుటుంబాలు ఉంటున్నాయి. దాదాపు 80 ఏండ్ల నుండి చెంచులు అక్కడ నివాసం ఉంటున్నారు. వాళ్ళు ఇంతవరకు కరెంటుకు నోచుకోలేదని, పక్కనే ఉన్న మర్రిపాలెం, చింతల, తుమ్మలబైలు, గూడేలకు బయోలాబ్ సిటీ విద్యుత్ కరెంటు అనుమతులు ఇచ్చారని. నల్లమల్ల ఫారెస్ట్ లో రోడ్డు పక్కనే చిన్నారుట్ల గూడెం ఉందని. శిఖరం నుండి కేవలం 6 కిలోమీటర్లు దూరం మాత్రమే చిన్నా రుట్ల ఉందని, శిఖరం నుండి చిన్నారుట్లకు కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని అక్కడినుండి చిన్నారుట్లకి చాలా దగ్గరవుతుందని. అంతేకాదు కరెంటు పోల్ స్తంభాలు తక్కువ పడతాయని, కరెంటు పోల్స్ ఉన్నచో ఏపీఎస్పీడీసీ వాళ్ళు కరెంటు ఇస్తామని



ముందుకు వచ్చారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ మంత్రి కి తగు బడ్జెట్ కేటాయించాలని, ఆ బడ్జెట్ను చెంచు గిరిజనులకు అందేలా చూడాలని. పై విషయాలను "డి ఎఫ్ ఓ".కి విన్నవించగా సానుకూ లంగా స్పందించారు. 'ఏపీఎస్పీడీసీఎల్' ఎస్సీ తో మాట్లాడి. కరెంటు వచ్చేలాగా తగు చర్యలు తీసుకుంటానని అలాగే ఫారెస్ట్ అనుమతులు ఇచ్చే లాగున తగు చర్యలు తీసుకుంటానని గిరిజన నాయకులకు హామీ ఇవ్వడం జరిగింది. డీఎఫ్ఓ ను కలిసిన వారిలో కే, వెంకటేశం, గురవయ్య, బసవయ్య, లింగన్న.. దేవయ్య, గంగమ్మ, వీరన్న. తదితరులు పాల్గొన్నారు.

# బడిలో వెలసిన నీటి కొలను- చదువుకోవాలంటే కొలను దాటి వెళ్లాల్సిందే...!







-చిన్నారుల అవస్థలు.. డ్రైనేజీ లేక జలమయమైన పాఠశాల!

బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని సంతజుటూరు ప్రభుత్వ పాఠశాలలో వర్షం వస్తే చాలు,పాఠశాల ఆవరణ మొత్తం నీటితో నిండిపోతోంది. స్కూల్ బయట నీళ్ళు.. స్కూల్ లోపల నీళ్లు.. ఏకంగా పాఠశాలలోనే నీటి కొలను వెలసిన పరిస్థితి! సంతజుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ దుస్థితి నెలకొంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ సౌకర్యం లేక నీరు నిలిచిపోతోంది. దీంతో పుస్తకాలతో బడికి వచ్చే చిన్నారులు తరగతి గదులకు చేరాలంటే నిలిచిన నీటిని దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది.చిన్న వర్షానికే ఇంతటి పరిస్థితి ఉంటే.. భారీ వర్షాలు కురిస్తే పిల్లల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతపై అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. చదువుకోవాల్సిన బడిలో.. నీళ్లను దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందో. వేచి చూద్దాం!

# జెడ్పీ కార్యకలాపాలకు నంద్యాలలో తాత్కాలిక కార్యాలయ ఏర్పాట్లు





-అనువైన భవనం, మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల, సెప్టెంబరు 21 వార్త సాక్ష్యం

జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) కార్యకలాపాలను నంద్యాల నుంచే సజావుగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాలయ వసతులను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుత జెడ్పీ పాలకవర్గం పదవీకాలం ఈనెల 24తో ముగియనుండగా, సెప్టెంబరు 25 నుంచి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించనున్న నేపథ్యంలో జెడ్పీ కార్యాలయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.జెడ్పీ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు నంద్యాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాలు, వసతులను జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆడిట్ కార్యాలయ ప్రాంగణాల్లో అందుబాటులో ఉన్న గదులు, కార్యాలయ నిర్వహణకు అనువైన వసతులు, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. నూతన జెడ్పీ భవనం అందుబాటులోకి వచ్చే వరకు అనువైన తాత్కాలిక భవనంలో కార్యాలయ కార్యకలాపాలు సజావుగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 25 నుంచి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో జెడ్పీ కార్యకలాపాలు కొనసాగనున్న నేపథ్యంలో డిప్యూటీ సీఈఓ, అకౌంట్స్ ఆఫీసర్తో పాటు సుమారు 50 మంది సిబ్బంది కర్నూలు నుంచి నంద్యాలకు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన కార్యాలయ గదులు, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను సమకూర్చేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# మైనారిటీల హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం







-ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆగ్రహం

నంద్యాల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

నంద్యాల గాంధీ చౌక్ వద్ద SDPI ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షా శిబిరాన్ని సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా సందర్శించి సంపూర్ణ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు: మైనారిటీల మనోభా వాలతో ఆటలా? కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను గాలికొదిలేసి మైనారిటీల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. భవనాల బదిలీ ఉపసంహరించుకోవాలి: వైఎస్ నగర్లోని మైనారిటీ బాలికల పాఠశాలలు, జూనియర్ కాలేజీ, హాస్టళ్లకు చెందిన 6 కీలక భవనాలను జిల్లా పరిషత్కు ఇచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలి.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ ఏదీ?: వక్ఫ్ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే వాటిని అన్యాక్రాంతం చేసేలా వ్యవహరించడం శోచనీయం. సున్నీ మసీదుకు చెందిన పవిత్రమైన వక్ఫ్ బోర్డు స్థలాన్ని కోర్టు భవన నిర్మాణానికి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.మంత్రి వైఖరి బాధాకరం: ఎందరో ముస్లిం పెద్దలు ప్రాణాలకు తెగించి కాపాడుకున్న పవిత్ర స్థలాన్ని ఇలా అప్పగించడం అత్యంత బాధాకరం. స్వయంగా మైనారిటీ, న్యాయశాఖ మంత్రి అయి ఉండి కూడా ఈ నిర్ణయానికి ఆమోదం తెలపడం ముస్లిం సమాజాన్ని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.వక్ఫ్ భూమి కేటాయింపు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేసి, పవిత్ర స్థలాన్ని కాపాడే వరకు పోరాటం ఆగదు అని అన్నారు

# అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు

-పొలాల్లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు.



వార్త సాక్ష్యం సెప్టెంబర్ 21 వెలుగోడు :

వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామ సమీపం లో సోమవారము ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆత్మకూరు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి అకస్మాత్తుగా రోడ్డు ప్రక్కకు దూసుకెళ్లిశీది. ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు, విద్యార్థులు ఉన్నారు. డ్రైవరు సమయస్ఫూర్తి గా వ్యవహారించడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎమర్జెన్సీ డోర్ తెరుచుకొని కొందరు , మామూలు డోర్ ద్వారా కొందరు ప్రయాణికులు సురక్షితంగా కిందికి దిగారు . అయితే ఈ ప్రమాదము డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిందా లేక బస్సు సాంకేతిక లోపమా అనేది తేలాల్సి ఉంది. ఈ ప్రమాదాన్ని బట్టి ఆర్టీసీ అధికారులు బస్సుల నియంత్రణపై , సిబ్బంది విధుల పైన నిర్లక్ష్యంగా ఉన్నట్లు అర్థమవుతుంది.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ



శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

అష్టదశ శక్తి పీఠం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహా క్షేత్రంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఆనంద్ బర్ధన్ ఐఏఎస్ వారు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఈవో ఎం. శ్రీనివాసరావు స్వాగతం పలికారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనానంతరం ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో సత్కరించడం జరిగింది.

# అన్న ప్రసాద వితరణకు దాతల విరాళం



శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 21 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శ్రీ స్వయంప్రకాశం కార్తిక్, ఏలూరు వారు అన్నప్రసాదవితరణ పథకానికి రూ.2,50,000 /-లు విరాళాన్ని అందజేశారు. ఇందులో ఎస్. ప్రభాకరరావు మరియు శ్రీదేవి వారి జ్ఞాపకార్థం రూ. 1,50,000/-లు మరియు ఎస్. విజయశ్రీ వారి జ్ఞాపకార్థం రూ. 1,00,000లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు సహాయ కార్యనిర్వహణాధికారి యం. ఫణిధరప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు అందజేయబడ్డాయి.

# పౌష్టికాహారంతో రక్తహీనతకు నివారణ

గణపవరం సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం



పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలికలు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను నివారించవచ్చని అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు. గణపవరం పంచాయతీలో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో భాగంగా తల్లులకు పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయల ప్రాధాన్యంపై అవగా హన కల్పించారు.ఆకుకూరలు, కూరగాయలతో వంట చేసేటప్పుడు వాటిలోని పోషకాలు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నియంత్రి ంచవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జి. హైమావతి, బి. విజయలక్ష్మి, ఎన్.ఎస్. రత్నకుమారి, యు. నాగమారుతి, పి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక

## అన్న ప్రసాద వితరణకు దాతల విరాళం



శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 21 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శ్రీ కె. బద్రినారాయణ, గుంటూరు వారు అన్నప్రసాదవితరణ పథకానికి రూ.1,00,011/-లు విరాళాన్ని విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాద్ కు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు అందజేయబడ్డాయి.

## అన్న ప్రసాద వితరణకు దాతల విరాళం



శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 21 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శ్రీ యిమ్మడిశెట్టి శ్రీహరిరావు, గుంటూరు వారుఅన్నప్రసాదవితరణ పథకానికి రూ.1,00,111/-లు విరాళాన్ని విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు సహాయ కార్యనిర్వహణాధికారి యం. ఫణిధరప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు అందజేయబడ్డాయి.

## అన్న ప్రసాద వితరణకు దాతలు విరాళం



శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 21 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శ్రీమతి వై. యామిని, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా వారు అన్న ప్రసాదవితరణ పథకానికి రూ.1,00,116/-లు విరాళాన్ని విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు సహాయ కార్యనిర్వహణాధికారి యం. ఫణిధరప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు అందజేయబడ్డాయి.

## డిమాండ్ల పరిష్కారానికి కాంట్రాక్టు ఉద్యోగుల భిక్షాటన

-ప్రభుత్వ దృష్టికి ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

బాపట్ల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం



ఉద్యోగ భద్రత, సేవలకు గుర్తింపు, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు వినూత్న నిరసనకు దిగారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఆదివారం బాపట్లలోని స్థానిక ఆసుపత్రి ప్రాంగణంలో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ సభ్యుడు సత్యం రాజు కూరపాటి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ నిరసన చేపట్టారు.కాంట్రాక్టు ఉద్యోగులుగా ప్రభుత్వ వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ ఉద్యోగ భవిష్యత్తుపై స్పష్టత, భద్రత లేకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సేవలను ప్రభుత్వం గుర్తించి, ఉద్యోగులకు స్థిరత్వం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టిని ఆకర్షించేందుకు ఖాళీ పాత్రలతో భిక్షాటన చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సత్యం రాజు కూరపాటి మాట్లాడుతూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాకుండా తమ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే నిరసన నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి తమ సమస్యలను కుటుంబ పెద్దగా పరిగణించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశాఖలో ప్రజలకు సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.ఉద్యోగ భద్రత, సేవలకు తగిన గుర్తింపు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ నిరసనలో భాగంగా చేపట్టిన భిక్షాటన కార్యక్రమం ఆసుపత్రికి వచ్చిన రోగులు, సందర్శకుల దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమంలో నళిని, బహాటం నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలి







-పిజిఆర్ఎస్‌కు 362 దరఖాస్తులు

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, సెప్టెంబరు 21 వార్త సాక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ, పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో నిర్వహి ంచిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా 362 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అధికారుల పిజిఆర్ఎస్ లాగిన్‌లలో ఇప్పటివరకు పరిశీలించని 135 దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలని ఆదేశిం చారు. ఏ దరఖాస్తు కూడా ఎట్ టు వ్యాస్థాయిలో పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలిం చాలని, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. రీఓపెన్ అయిన దరఖాస్తుల్లో ఇంకా 13 అర్జీలు పరిష్కరించాల్సి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారికి సమర్పించిన దరఖాస్తుల్లో ఒక అర్జీ ఇంకా పెండింగ్‌లో ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రతి అర్జీపై తీసుకున్న చర్యలను పిజిఆర్ఎస్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

-రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 170 అర్జీల స్వీకరణ

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా జిల్లాలో మొత్తం 170 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 6, అడంగల్ సవరణలకు 24, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించి 11, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబం ధించి 41, రెవెన్యూ కోర్టు విచారణలు/ ఆర్ఓఆర్‌కు సంబంధించి 40, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 46, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 2 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. రెవెన్యూ క్లినిక్స్‌లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన కొన్ని దరఖాస్తులు ఆత్మకూరు మండలం శ్రీరామనగర్, కప్పల కుంట చెందిన కళావతి తన ఆస్తి పన్ను, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఈసీ ఆధారంగా తనకు కేటాయించిన డోర్ నంబర్‌ను మున్సిపాలిటీ పొరపాటున మరో వ్యక్తికి కేటాయించిందని, తనకు కేటాయించిన డోర్ నంబర్‌ను తిరిగి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.మిడ్తూరు మండలం వీపన గండ్లకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వేల్పుల మాణిక్యరావు, తన తల్లి పేరుతో వీపనగండ్ల గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 14లో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందున, నిబంధనల మేరకు నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. నందికొట్కూరు మండలం: విద్యపోగు లక్ష్మీదేవి తన భర్త మరణించడంతో జీవనోపాధి కష్టంగా మారిందని, తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి






-డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమగ్ర కార్యాచరణ

-అధికారులు శాఖల వారీగా పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

-నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల, సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటక రంగం తదితర కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద మొదటి త్రైమాసిక వ్యయాన్ని 100 శాతం బుక్ చేసి, తదుపరి నిధుల వినియోగానికి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచిస్తూ డిసెంబర్ నాటికి గణనీయమైన పురోగతి సాధించాలని ఆదేశించారు. PM SETU కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల ద్వారా ఐటీఐల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని, జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి మంజూరైన MSME పార్కుల్లో రోడ్లు, నీరు, పైప్‌లైన్లు తదితర మౌలిక వసతుల పనులను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికి జిల్లాలో నిలిచిపోయిన, అసంపూర్తిగా ఉన్న సుమారు 15 వేల గృహాలను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. టిడ్కో ఇళ్ల పనులను వేగవంతం చేసి, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి హెల్త్ రిసార్ట్స్, రెవెన్యూ సైట్లు, రోడ్‌సైడ్ సౌకర్యాలకు సంబంధించిన భూ ప్రతిపాదనలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో నంది ఫెస్టివల్, బెలూం ఫెస్టివల్ వంటి స్థానిక ఉత్సవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలంలో శాశ్వత హెలిప్యాడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కేంద్రానికి హెలిపోర్ట్ లేని నేపథ్యంలో హెలిపోర్ట్ కోసం 10-15 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జలధార ఫేజ్-2 పనులతో పాటు మొక్కల పెంపకం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్ పిట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, అమృత్ మరియు వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అధికారుల సమన్వయంతో నీటి వనరులను సుందరీకరించాలని సూచించారు. అటవీ శాఖ నర్సరీల అభివృద్ధి, ఆటిజం సెంటర్ల నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు, వన్‌స్టాప్ సెంటర్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు

# శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు





శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 21 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధనలో) ఈ రోజు శ్రీనృత్య కళానిలయం, విజయవాడ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది.ఈ కార్యక్ర మములో వినాయకకౌత్వం, జతిస్వరం, కంజదళా యతాక్షి, నమశ్శివాయతే, గణేశపంచరత్నకీర్తన, అర్ధనారీశ్వర అష్టకం, శివశివ భవ భవ తదితర గీతాలకు, అష్టకాలకు సత్యానందిని, కాత్యాయని, భావన, వేదసహస్ర, కృత్తికా తదితరులు నృత్య ప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# పిల్లల నిండు నూరేళ్ల జీవితం- తల్లిదండ్రుల చేతుల్లోనే...!

-మైనర్ల చేతికి ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు
-ఒక్క క్షణం నిర్లక్ష్యం.. జీవితాంతం చీకటి
-మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తే కేసులు తప్పవు
-ఆత్మకూరు వినాయక నిమజ్జనం ప్రమాదాలే నిదర్శనం
-తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు.. సమాజం బాధ్యత తీసుకోవాలి
-వాహనం ఇవ్వడం కంటే.. పిల్లల ప్రాణాలను కాపాడటమే ముఖ్యం
-ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వరరెడ్డి.



ఆత్మకూరు సెప్టెంబర్21 వార్త సాక్ష్యం

పిల్లలపై ప్రేమతో ద్విచక్ర వాహనాలు కొనిచ్చి రోడ్డుపైకి పంపుతున్న తల్లిదండ్రులు ఒక్కసారి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వరరెడ్డి అన్నారు.మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తుతో పాటు వారి ప్రాణాలను కాపాడటం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తు చేశారు.ఆదివారం ఆంధ్రప్రభ తో పట్టణ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడుతూ ఆత్మకూరు అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9,10వ తరగతి,ఇంటర్ విద్యార్థులు అధికంగా ద్విచక్ర వాహనాలపై పాఠశాలలు కళాశాలలకు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చిన్న వయసులోనే వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

-నిమజ్జనం ప్రమాదాలే నిదర్శనం

తల్లిదండ్రులు మైనర్ యువకులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సీఐ సూచించారు. ఇటీవల ఆత్మకూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణానికి చెందిన యువకులకు చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

-ఒక్క క్షణం నిర్లక్ష్యం.. జీవితాంతం వేదన

పిల్లలు వాహనం అడిగారని తోటి విద్యార్థులంతా వాహనాలపై వస్తున్నారని తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇవ్వడం సరికాదన్నారు.ఒక ప్రమాదం ఒక కుటుంబం భవిష్యత్తునే మార్చే అవకాశం ఉందని అనుకోని ఘటనలతో తల్లిదండ్రుల కడుపుకోత మిగలకుండా ముందుగానే జాగ్రత్త పడాలని సూచించారు.

-వాహనం ఇచ్చిన వారిపైనా చర్యలు

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు గుర్తిస్తే వాహనం నడుపుతున్న విద్యార్థితో పాటు వాహనం ఇచ్చిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

-పోలీసులతో పాటు తల్లిదండ్రులదీ బాధ్యత

మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టడం కేవలం పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని సీఐ పేర్కొన్నారు. తల్లిదండ్రులు పాఠశాలలు కళాశాలల యాజ మాన్యాలు ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.

-పిల్లల భవిష్యత్తు కోసం ఇప్పుడే నిర్ణయం

పిల్లలకు వాహనం ఇవ్వడం వారి అవసరం తీర్చడం కాదని వారి భద్రతను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని తల్లిదండ్రులు గుర్తించాలని సీఐ సూచించారు. మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు సమాజంపై బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు తల్లిదండ్రులు ఇప్పటికైనా అప్రమత్తమై మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రభ పత్రిక ముఖంగా ఓ. మహేశ్వరరెడ్డి, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల చైర్మన్ పీఠంపై కన్నేసిన మనియార్ ఖలీల్

-నంద్యాల పట్టణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారిన చైర్మన్ పదవి

నంద్యాల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

నంద్యాల టిడిపి రాజకీయాల్లో చైర్మన్ పీఠం ఎవరిని వరించనుందన్న అంశం ప్రస్తుతం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా ఉంటూ, పార్టీనే నమ్ముకుని కొనసాగుతున్న నాయకుల్లో మనియార్ ఖలీల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు పలు పార్టీ కార్యక్రమాల్లో లోకేష్ యువ గలం పాదయాత్ర అయితే నేమి చంద్రబాబు నాయుడు నంద్యాల రెండు పర్యటనల లో అయితే నేమి ఎన్నో విధాలుగా పార్టీ కోసం ఆర్థికంగా రాజకీయంగా ఎన్నో సేవలు అందించిన ఘనత మణియార్ ఖలీల్ దక్కుతుందని చెప్పొచ్చు. ప్రస్తుతం ఆశావాహులుగా ఉన్న ఏ ఒక్క అభ్యర్థి కూడా ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు మొహం చాటేసారు తప్ప పార్టీ కార్యక్రమాలలో గాని ఇతరత్ర ఏఏ కార్యక్రమాలలో పాల్గొన్న దాఖలాలు లేవు కానీ ఖలీల్ మాత్రం ప్రతి ఒక్క కార్యక్రమంలో నేను ఉన్నను అని పార్టీ కోసం అంటూ పార్టీ కోసం ఎన్నో సేవలు అందించిన ఘనత కేవలం ఖలీల్కే దక్కుతుందని చెప్పవచ్చుపార్టీ పట్ల విధేయతతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, కరోనా కాలంలో సైతం సామాజిక సేవా కార్యక్రమాలలో ముందు వరసలో ఉంటూ ఎవరైనా సహాయం కోసం తన వద్దకు వస్తే తనకు తోచిన విధంగా అండగా నిలుస్తూ ఖలీల్ ముందుకు వెళ్లారు.ముఖ్యంగా తన సామాజిక వర్గం లోనూ మంచి గుర్తింపు సంపాదించుకున్న ఖలీల్ రాజకీయంగా మరింత ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.చైర్మన్ పీఠంపై తెలుగు దేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆసక్తి చూపుతున్నప్పటికీ, అధిష్టానం తన వైపే మొగ్గు చూపుతుందన్న ఆశాభావాన్ని ఖలీల్ వ్యక్తం చేస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.అయితే చైర్మన్ పదవికి పలువురు ఆశావహులు ఉన్న నేపథ్యంలో అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్నది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. సామాజిక సమీక`రణాలు, పార్టీకి చేసిన సేవలు, స్థానిక రాజకీయ పరిస్థితులు వంటి అంశాలు నిర్ణయంలో కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఆ సమీకరణం ఖలీల్‌కు అనుకూలంగా మారుతుందా? అన్న చర్చ కూడా నంద్యాల రాజకీయ వర్గాల్లో సాగుతోంది. చైర్మన్ పీఠం కోసం పలువురు నాయకులు పోటీ



పడుతున్న వేళ.. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది? ఖలీల్‌కు అవకాశం దక్కుతుందా? లేక మరో ఆశావహుడిని తెరపైకి తీసుకువస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా అధిష్టానం అండదండలతో తన రాజకీయ ప్రయాణాన్ని తెలుగు దేశం పార్టీతో కొనసాగిస్తానని పదవి వచ్చినా రాకు న్నా పార్టీ కోసం కష్టపడి పని చేయడానికి ఎంతవరకు అయినా ముందుకు సాగిపోయి తెలుగు దేశం పార్టీ ప్రతిష్టలు ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని ఖలీల్ తెలిపారు

# మైనార్టీల ఆస్తులు కబ్జా చేస్తారా...?






-కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి తీవ్ర ధ్వజం

నంద్యాల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

" వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతామని మాయమాటలు చెప్పిన కూటమి నేతలు, నేడు మైనార్టీల స్థలాలను ప్రభుత్వానికి ధారాదత్తం చేయడం ఘోరాతిఘోరం. స్వయంగా ప్రభుత్వమే మైనార్టీల హక్కులు, స్థలాలను కబ్జా చేసే దుస్థితికి దిగజారింది" అని నంద్యాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నంద్యాల పట్టణంలో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఎస్డీపీఐ (SDPI) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి శిల్పా రవిరెడ్డి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషాతో కలిసి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా శిల్పా రవిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్సీపీ హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనార్టీల సంక్షేమం, విద్య కోసం ఎంతో కృషి చేశారు. అందులో భాగంగానే నంద్యాలలో ఉర్దూ కళాశాల వసతిగృహం భవనాలను నిర్మిస్తే, ఈ కూటమి ప్రభుత్వం వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించుకోవాలని చూడటం దారుణం అన్నారు. వక్ఫ్ బోర్డు, మైనార్టీల స్థలాలను కేవలం వారి అభ్యున్నతికే ఉపయోగించాలి తప్ప ప్రభుత్వ అవసరాలకు వాడరాదన్నారు. అధికారం చేపట్టి రెండున్నరేళ్లు కాస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు, కొత్త పెన్షన్ల ఊసే లేదు. రైతులకు 'రైతు భరోసా' ఎగ్గొట్టి వారిని రోడ్డున పడేసిన దౌర్భాగ్య ప్రభుత్వం అని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీల హక్కులను కాలరాస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ఈ కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బాధితులు, ప్రజాసంఘాలు చేసే ప్రతీ పోరాటానికి వైఎస్సార్సీపీ వెన్నుముకగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి, రాష్ట్రఎస్టీ సెల్ కార్యదర్శి ఆంజనేయులు మాజీ కౌన్సిలర్ తమిమ్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, గన్ని కరీం, జలీల్, వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పత్రాలు లేకుంటే చర్యలు తప్పవు

-ఎస్ ఐ మాధవరావు..



బాపట్ల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు చందోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగుపాలెం కోడూరు వద్ద ఎస్ఐ కె. మాధవరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘ నలకు దూరంగా ఉండాలని తెలిపారు. రహదారి ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, బీమా పత్రాలు, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం వంటి సంబంధిత పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. చెల్లుబాటయ్యే పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే నిబంధనల ప్రకారం జరిమానాలు, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ మాధవరావు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎవరూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

-మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలోని ఈపూరు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముం దుకు సాగాలని పిలుపునిచ్చారు.చంద్రబాబు అబద్ధాలను పదేపదే చెప్పి ప్రజలను నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తారని బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. ఇందుకు తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారమే నిదర్శనమని పేర్కొన్నారు. శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు ఉందంటూ భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు చేసిన ప్రచారానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తే సమాధానమని అన్నారు.తిరుమల లడ్డూ వ్యవహారంలో నెయ్యి కల్తీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2026 సెప్టెంబర్‌లో చేసిన ప్రకటనల్లో పామాయిల్, పామోలిన్, ఇతర రసాయనాలు ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

# కలెక్టరేట్‌లో ఘనంగా గురజాడ జయంతి




బాపట్ల సెప్టెంబర్ 21 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. మహాకవి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి గురజాడ అప్పారావు అందించిన అమూల్యమైన సేవలను, ఆయన సాహిత్య విశేషాలను వివరించారు. గురజాడ అప్పారావు ఆశయాలను స్మరించుకుంటూ ప్రజలకు సేవ చేయడం ప్రతి అధికారి కర్తవ్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్టతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వార్త
సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 22 సెప్టెంబర్ 2026

# బిజినెస్

## 6 కోట్ల టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఎన్ఎండీసీ



దేశీయంగా ఉక్కు తయారీ కంపెనీల నుంచి డిమాండ్ గణనీయంగా పెరుగుతుండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 6 కోట్ల టన్నుల ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్ఎండీసీ చైర్మన్ అమితవ ముఖర్జీ వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 5 కోట్ల టన్నుల మైలురాయిని అధిగమించామని, ప్రస్తుతమున్న ఇనుప ఖనిజ గనులు, ఎన్ఎండీసీ-సీఎండీసీ లిమిటెడ్ (ఎన్సీఎల్) జాయింట్ వెంచర్ ద్వారా నిర్దేశిత 6 కోట్ల టన్నుల ఉత్పత్తిని చేరుకునేందుకు ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 2030-31 నాటికి 30 కోట్ల టన్నుల దేశీయ ఉక్కు తయారీ స్థాపిత సామర్థ్యాన్ని సాధించాలన్న జాతీయ ఉక్కు విధానం 2017కు అనుగుణంగా.. ఎన్ఎండీసీ ఉత్పత్తిని కూడా 10 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖర్జీ వివరించారు.

## మరో లోన్ తీసుకుంటున్నారా? ముందుగా ఈ లెక్క చూడండి!

జీతం వస్తోంది.. ఖర్చులు సాఫీగానే సాగుతున్నాయి. దీంతో మరో లోన్ తీసుకోవడం పెద్ద భారంగా అనిపించకపోవచ్చు. కానీ ఇప్పటికే ఉన్న ఈఎంఐలకు కొత్త ఈఎంఐ జత అయితే నెలవారీ బడ్జెట్‌పై ఒత్తిడి పెరగొచ్చు. అందుకే కొత్త లోన్‌కు ఓకే చెప్పే ముందు ఆదాయంలో ఎంత శాతం అప్పుల చెల్లింపులకే వెళు _ందో తెలుసుకోవడం ముఖ్యం.ఆదాయం ఎంత? ఈఎంఐలు ఎంత?కొత్త లోన్ విషయంలో ముందుగా చేతికి వచ్చే నెలవారీ ఆదాయాన్ని లెక్కలోకి తీసుకోవాలి. స్థూల జీతాన్ని కాకుండా పన్నులు, ఇతర మినహాయింపుల తర్వాత బ్యాంకు ఖాతాలో జమయ్యే మొత్తాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.తర్వాత ప్రస్తుతం చెల్లిస్తున్న అన్ని ఈఎంఐలను కలపాలి. గృహ రుణం, కారు లోన్, పర్సనల్ లోన్, విద్యా రుణం వంటి చెల్లింపులతో పాటు క్రెడిట్ కార్డు బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి 30 శాతం.. ఓ హెచ్చరిక రేఖ టాన్స్‌యూనియన్ సిబిల్ సూచనల ప్రకారం.. నెలవారీ ఆదాయంలో ఈఎంఐలు, క్రెడిట్ బకాయిల వాటా 30 శాతంలోపు ఉండటం ఆరోగ్యకరమైన స్థాయిగా పరిగణించవచ్చు. అయితే ఇది అందరికీ వర్తించే కచ్చితమైన పరిమితి కాదు.ఉదాహరణకు నెలకు రూ.80 వేల ఆదాయం ఉందనుకుందాం. ప్రస్తుతం రూ.20 వేల ఈఎంఐలు ఉంటే అప్పుల చెల్లింపుల వాటా 25 శాతం. మరో రూ.8 వేల ఈఎంఐ వచ్చే లోన్ తీసుకుంటే మొత్తం చెల్లింపులు రూ.28 వేలకు చేరతాయి. అప్పుడు ఈఎంఐ-ఆదాయ నిష్పత్తి 35 శాతానికి పెరుగుతుంది.50 శాతం దాటితే జాగ్రత్త



ఈఎంఐలు ఆదాయంలో 50 శాతానికి చేరడం లేదా దాటడాన్ని రుణదాతలు సాధారణంగా నిశితంగా పరిశీలిస్తారు. అయితే కొత్త లోన్ తీసుకునే ముందు ఈఎంఐలతో పాటు అద్దె, ఇంటి ఖర్చులు, బీమా ప్రీమియాలు, ఇతర నెలవారీ బిల్లులను కూడా లెక్కలోకి తీసుకోవాలి. కొత్త ఈఎంఐను భరించగలమా? అనే విషయాన్ని కేవలం ఆ ఒక్క చెల్లింపు ఆధారంగా నిర్ణయించకూడదు. మొత్తం నెలవారీ ఆర్థిక బాధ్యతలను చూసిన తర్వాతే నిర్ణయం తీసుకోవడం కీలకం.

## పండగ వేళ ప్రయాణికులకు చుక్కలు.. ఆకాశాన్నంటుతున్న విమాన చార్జీలు

దీపావళి పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడానికి సొంతూళ్లకు వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు విమానయాన సంస్థలు గట్టి షాక్ ఇస్తున్నాయి. పండగ డిమాండ్, పెరిగిన ఇంధన ధరల కారణంగా దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణ చార్జీలు ఆకాశాన్నంటాయి. దీంతో పండగ ప్రయాణం సామాన్యుడికి పెను భారంగా మారింది. గతంతో పోలిస్తే టికెట్ల ధరలు చాలా రూట్లలో రెట్టింపు కంటే అధికంగా ఉండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దేశీయంగా ప్రధాన నగరాల మధ్య ప్రయాణ చార్జీలు విపరీతంగా పెరిగాయి. ఉదాహరణకు అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ-బెంగళూరు మార్గంలో రెండు సంవత్సరాల క్రితం రౌండ్-ట్రిప్ టికెట్ ధర సుమారు రూ. 13,000 ఉండగా.. ఇప్పుడు పండగ సీజన్‌లో అది రూ. 20,000 దాటిపోతోంది. కొన్ని మార్గాలలో అయితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. సాధారణ రోజులతో పోలిస్తే కొన్ని రూట్లలో ఏకంగా 300 శాతానికి పైగా ధరలు పెరిగాయి. దుర్గా పూజ సమయంలో కోల్‌కతా-దేవ్ గఢ్ మార్గంలో సాధారణంగా రూ. 2,800 ఉండే టికెట్ ధర, ఏకంగా రూ. 12,500కి చేరడం దీనికి నిదర్శనం. అంతర్జాతీయంగా కూడా అదే పరిస్థితి.. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా, యూఏఈ నుంచి భారత్‌కు వచ్చే విమాన సర్వీసుల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. నవంబర్ 5న దుబాయ్ నుంచి ఢిల్లీకి వచ్చే విమాన టికెట్ ధర, ఎయిర్‌లైన్‌ను బట్టి సుమారు 1,013 (రూ.26,424) నుంచి 1,214 దిర్హమ్(రూ.31,667)ల వరకు పలుకుతోంది. అబుదాబి, షార్జా నుంచి బయలుదేరే విమానాల్లోనూ దాదాపు ఇదే స్థాయిలో ధరలు ఉన్నాయి.విమాన చార్జీల పెరుగుదలకు ప్రధానంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు పెరగడమే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ



ఏడాది సెప్టెంబర్‌లోనే ఏటీఎఫ్ ధర లీటర్‌పై రూ. 6.28 (5.46 శాతం) పెరిగి, రూ. 121.28కి చేరింది. దీనికి తోడు అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరగడం కూడా విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాన్ని పెంచుతోంది. పండగ సీజన్‌లో టికెట్లకు ఉండే అధిక డిమాండ్‌ను కూడా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి.తగ్గించుకోవడం, సమీపంలోని విమానాశ్రయాలను పరిశీలించడం లేదా రైలు ప్రయాణాన్ని ఎంచుకోవడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సూచిస్తున్నాయి.

## జపాన్‌తో తొలి టీ20.. ఇది థ్రిల్లింగ్ ఛాలెంజ్: శ్రేయస్ అయ్యర్

అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయానికి టీమిండియా శ్రీకారం చుట్టనుంది. చరిత్రలో తొలిసారిగా జపాన్‌తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడేందుకు భారత జట్టు సిద్ధమైంది. అయితే, సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగాల్సిన భారత జట్టు ప్రాక్టీస్ సెషన్ భారీ వర్షం కారణంగా రద్దయింది. అయినప్పటికీ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం పూర్తి ఉత్సాహంతో ఉన్నాడు. తెలియని ప్రత్యర్థితో వారి గడ్డపై ఆడటం ఒక 'థ్రిల్లింగ్ ఛాలెంజ్' అని అతను అభివర్ణించాడు. అంతకు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "తొలిసారిగా జపాన్‌తో ఆడుతు న్నాం. ఇది మాకు ఎంతో థ్రిల్లింగ్‌గా, ఉత్సాహంగా ఉంది. ఇక్కడి పరిస్థితులు, వికెట్ గురించి మాకు పెద్దగా అవగాహన లేదు. అయినా ఒక మంచి మ్యాచ్ ఆడాలని ఎదురుచూస్తున్నాం" అని తెలిపాడు.

**-వీడియో క్లిప్పులతో ప్రత్యర్థిపై అధ్యయనం**

జపాన్ జట్టుతో ఇంతకుముందెన్నడూ తలపడనందున, వారి ఆటగాళ్ల బలాబలాలను అంచనా వేయడానికి భారత టీమ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీని ఆశ్రయిస్తోంది. ప్రత్యర్థి ఆటగాళ్లకు సంబంధించిన వీడియో ఫుటేజ్, డిజిటల్ క్లిప్పులను నిశితంగా పరిశీలిస్తోంది. "నేను వారికి సంబంధించిన కొన్ని రీల్స్ చూశాను. మేము వారి ఆటగాళ్ల గురించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బరిలోకి దిగుతాం. మ్యాచ్‌కు వర్షం అడ్డుపడదని, అభిమానులందరూ ఒక మంచి పోటీని చూస్తారని ఆశిస్తున్నా" అని అయ్యర్ పేర్కొన్నాడు.జపాన్ సంస్కృతి, ఆతిథ్యానికి ఫిదా పాతతరం క్రికెట్ దేశాలకు భిన్నంగా జపాన్‌లో పర్యటించడం ఒక కొత్త అనుభూతినిస్తోందని అయ్యర్ చెప్పాడు. "ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ వంటి పర్యటనలకు ఇది పూర్తిగా భిన్నమైనది. జపాన్ రావడం ఇదే తొలిసారి. ఇక్కడి ప్రజలు, సంస్కృతి, క్రమశిక్షణ అన్నీ కొత్తగా ఉన్నాయి. కొత్త సంస్కృతులను ఇష్టపడే నాకు ఇది బాగా నచ్చింది. భారత్, జపాన్ మధ్య



స్నేహబంధం బలపడుతోంది. నాకు 'అరిగాటో', 'కొనిచివా' అనే రెండు జపనీస్ పదాలు తెలుసు" అంటూ నవ్వేశాడు. జపాన్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రజలు ఎంతో ఆప్యాయంగా, సహాయం చేసే గుణంతో ఉన్నారని, వారి ఆతిథ్యం అద్భుతంగా ఉందని ప్రశంసించాడు. క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది క్రికెట్ ఆడని దేశాలు కూడా ఇప్పుడు ఈ ఆటను వేగంగా అంది పుచ్చుకుంటున్నాయని అయ్యర్ వ్యాఖ్యానించాడు. "నేను దీని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ ఇప్పుడు క్రికెట్ ప్రతి దేశంలోనూ ప్రాచుర్యం పొందుతోంది. అన్ని జట్లు తమదైన శైలిలో రాణిస్తున్నాయి. జపాన్‌తో మ్యాచ్ కూడా ఆసక్తికరంగా ఉంటుందని నేను నమ్ముతున్నా" అని అన్నాడు. భారత్‌లో యువతారలు వెలుగులోకి రావడానికి ఐపీఎల్ ఒక గొప్ప వేదిక అని అయ్యర్ అభిప్రాయపడ్డాడు. "మా జట్టులోని యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చాడు. ప్రతిభను ప్రదర్శించడానికి ఇది ఒక బలమైన వేదిక. ఐపీఎల్‌లో రాణిస్తే అందరి దృష్టి మీపై ఉంటుంది. తద్వారా భారత జట్టులోకి రావడానికి అవకాశాలు మెరుగవుతాయి" అని వివరించాడు.

## టీమిండియాలోని 'బీహారీ సోదరుల'ను కలవాలని ఉంది: జపాన్ క్రికెటర్ అభిషేక్ ఆనంద్

జపాన్ గడ్డపై భారత క్రికెట్ జట్టు చారిత్రాత్మక పర్యటనకు సిద్ధమవుతున్న వేళ, ఓ ఆసక్తికరమైన మానవీయ కోణం వెలుగులోకి వచ్చింది. బీహార్‌లో పుట్టి, క్రికెట్‌పై మక్కువతో జపాన్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ ఆనంద్, టీమిండియాలోని తన 'బీహారీ సోదరులు' ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీలను కలవాలని తీవ్రంగా ఆకాంక్షిస్తున్నాడు. ఈ కలయిక కోసం అతను ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు.సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్-జపాన్ మధ్య ఏకైక టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ప్రకటించిన జట్టులో అభిషేక్‌కు చోటు దక్కనప్పటికీ, అతను జట్టుతో పాటే ఉంటాడు. ఈ సందర్భంగా ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ తన మనసులోని మాటను పంచుకున్నాడు. "ప్రస్తుతం అందరి ఫేవరెట్ వైభవ్ సూర్యవంశీ. అయితే భారత



జట్టులోని ఆటగాళ్లందరూ గొప్పవారే. కానీ, నా బీహారీ సోదరులైన ఇషాన్ కిషన్, వైభవ్‌లను కలిసే అవకాశం వస్తే అస్సలు వదులుకోను" అని అభిషేక్ తన అభిమానాన్ని వ్యక్తపరిచాడు. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్‌ను ప్రత్యక్షంగా చూడాలని ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపాడు.

# స్పోర్ట్స్

## చెన్నై సూపర్ కింగ్స్ కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్.. భారతీయుడే ఉండాలన్న ధోనీ!



ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ జట్టులో కీలక మార్పులు చేపట్టింది. భారత పేస్ దిగ్గజం జహీర్ ఖాన్‌ను 2027 సీజన్‌కు కొత్త హెడ్ కోచ్‌గా నియమించినట్లు సోమవారం అధికారికంగా ప్రకటించింది. గత 18 ఏళు _గా జట్టుతో అనుబంధం పెనవేసుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానాన్ని జహీర్ భర్తీ చేయనున్నాడు.వరుసగా మూడు సీజన్లలో సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమవడంతో స్టీఫెన్ ఫ్లెమింగ్ తన పదవి నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. అనంతరం అతడు ఇంగ్లండ్ పురుషుల టెస్ట్ జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఫ్లెమింగ్ నిష్క్రమణ తర్వాత సీఎస్‌కే యాజమాన్యం పలువురు అభ్యర్థులతో విస్తృత చర్చలు జరిపింది. జట్టుకు భారతీయ కోచ్ అయితేనే బాగుంటుందని, స్థానిక ఆటగాళ్లు, పరిస్థితులపై అతనికి మంచి అవగాహన ఉంటుందని సీఎస్‌కే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గట్టిగా సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే జహీర్ ఖాన్ నియామకం జరిగినట్లు తెలుస్తోంది.ఈ నియామకంపై జహీర్ ఖాన్ హర్షం వ్యక్తం చేశాడు. "ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన సీఎస్‌కేలో భాగం కావడం నాకు దక్కిన గౌరవం. ఒక క్రికెటర్‌గా నేను సీఎస్‌కేతో మైదానంలో తలపడ్డాను. చెపాక్‌లో సూపర్‌ఫ్యాన్స్ సృష్టించే వాతావరణం చాలా ప్రత్యేకం. గొప్ప చరిత్ర ఉన్న ఈ ఫ్రాంచైజీతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని జహీర్ ఒక ప్రకటనలో తెలిపాడు.జహీర్ నియామకాన్ని సీఎస్‌కే ఓనర్ రూపా గురునాథ్ నిర్ధారించారు. "జహీర్ ఖాన్‌ను హెడ్ కోచ్‌గా ధృవీకరిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

వార్త సాక్ష్యం — తెలుగు దిన పత్రిక — Editor : SAGINALA RAVI KUMAR

మంగళవారం 22 సెప్టెంబర్ 2026

# ‘ది ప్యారడైజ్’ చిత్రానికి ‘ఏ’ సర్టిఫికెట్ నాని చెప్పినట్టే జరిగింది!




నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ‘ఏ’ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమా ఈ నెల 24న థియేటర్లలోకి రానుంది. సెన్సార్ బోర్డు వివరాల ప్రకారం, ఈ సినిమా రన్‌టైమ్‌ను 2 గంటల 54 నిమిషాల 4 సెకన్లుగా ఖరారు చేశారు. దాదాపు మూడు గంటల నిడివితో వస్తున్న ఈ చిత్రంలో హింసాత్మక సన్నివేశాలు ఎక్కువగా ఉన్న కారణంగా సెన్సార్ బోర్డు పలు మార్పులను సూచించినట్లు తెలుస్తోంది. మొత్తం 21 చోట్ల కట్స్ లేదా మార్పులు చేయాలని సీబీఎఫ్‌సీ సూచించినట్టు సమాచారం. ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ వస్తుందని తాను ముందే ఊహించానని నాని ఇటీవలి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు పిల్లలు, కుటుంబ ప్రేక్షకులు రాలేరని అంగీకరిస్తూనే, అన్ని రకాల జానర్లలో సినిమాలు చేయాలనేదే తన ఉద్దేశమని, త్వరలోనే కుటుంబ కథా చిత్రాలు కూడా చేస్తానని ఆయన స్పష్టం చేశారు. సెన్సార్ పూర్తయిన విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ఓ పోస్టర్ ద్వారా ప్రకటించింది. “సినిమా లోని భావోద్వేగం అందరి కోసం. కానీ జడల్ క్రూరత్వం మాత్రం పెద్దలకు మాత్రమే” అంటూ పోస్టర్‌పై రాసుకొచ్చారు. ఈ వ్యాఖ్య సినిమా ఎంతరా అండ్ రస్టిక్‌గా ఉండబోతోందో తెలియజేస్తోంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించిన.




## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది: ప్రకాశ్ రాజ్

కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఊహించని రీతిలో పరాజయం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మార్పును ఆకాంక్షించే ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. విజయ్ ప్రభుత్వ పాలనను అప్పుడే విమర్శించడం సరికాదని... కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయాన్నయినా ఇవ్వాలని అన్నారు. ఏడాది పాలన పూర్తయిన తాను స్పందిస్తానని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయిందని... వారి పతన సమయం ఆసన్నమైందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. త్వరలోనే వారి విధానాల తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో రానున్న నియోజక వర్గాల పునర్విభజన బిల్లు దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, దీనికి ఏ పార్టీ మద్దతు ఇచ్చినా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని, ఆయనకు తాను ఓటు వేయకపోయినా... తనకు కూడా ఆయనే ప్రధానమంత్రి అని చెప్పారు. అందుకే ప్రజా సమస్యలపై ఆయనను నిలదీసే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.



## వెంకీ ‘ఆదర్శ కుటుంబం’ నుంచి ఫస్ట్ సింగిల్- డేట్ ఫిక్స్!




విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న ‘ఆదర్శ కుటుం బం’ సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట ‘నారాయణమ్మ’ను (సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని ‘నారాయణమ్మ’ పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూ జిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటే శ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా లో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపు ల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ‘ఆదర్శ కుటుంబం’ చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపం చవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.